

# సంధ్య

'చెంగలువ

'సంజమ్మా! నే పోతుండా' వన్నెం డేళ్ళ పని పిల్లడు తడిచేతుల్ని లాగు జేబులో పెట్టి తుడిచేసుకుంటు అప్పుడే గేటువైపు నడిచాడు.

'అయిపోయిందిరా పని?' వినిపించు కున్నట్టు నిదర్శనంగా ఏదో అడిగింది సంధ్య—కళ్ళు గోడమీది కాలండర్ మీంచి తిప్పకుండనే.

'జల్దిచేయనా? జరాసపని!' మాట అయిపోగానే గేటుచప్పుడు వినిపించింది.

అంతే. మళ్ళీ అంతటా ప్రశాంతమైన నిశ్శబ్దం.

ఎక్కడో దూరాన్నుంచి అప్పుడప్పుడు గాలిలో తేలుతూ ఏదోహిందీపాట. బహుశః హేమంతకుమార్ దేమో, వినిపిస్తోంది. మధ్యమధ్య మళ్ళీ గంభీరమైన నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో భయంలేదు. ఆ ప్రశాంత తలో ప్రళయంలేదు

అంతమందితో కళకళలాడే ఆ ఇల్లు ఇలాంటి సమయాల్లో ఎప్పుడూ ఇలాంటి నిశ్శబ్దంతోనే నిండిపోతుంది. కాని ఆదివారో అప్పుడు దీనికి అదో కళ వస్తుంది. అందు కనే ఎవరికీ తెలిసేనా తెలీదు వాళ్ళెవరూ లేనప్పుడు ఈ యిల్లెలా వుంటుందో! మునుపు సంధ్యకీ తెలీదు. కాని ఉష పురిటికి వచ్చినప్పట్నుంచి ఇక్కడే ఉండి పోడంతో — అప్పుడే మూణ్ణెల్లుగా ఈ నిశ్శబ్దం ఈ ప్రశాంతతా ఆమె కలవాటై పోయాయి.

వాళ్ళ నాన్నగారూ, పెద్దన్నయ్యా ఆఫీసులకి వెళ్ళిపోయారు. చిన్నన్నయ్య, తమ్ముడు వేణు, పెద్దచెల్లెలు మంజుల వాళ్ళవాళ్ళ కాలేజీలకు పోయారు. పద్మ, రమేష్, జయ స్కూళ్ళకు వెళ్ళారు. అమ్మ, వదిన అవతలపేట్లో వున్న పెద్దత్త వాళ్ళింటి కెళ్ళారు. ఏదో బజారుపనికో లేకపోతే కూర్చుందుకో వాళ్ళు వెడుతూనే వుంటారు. వీళ్ళందరూ పొద్దుట్నుంచి మొదలెట్టి పదిన్నరలోపులోనే వెళ్ళి పోతారు. ఇంక పనివాడుకూడా ఏ పది కొండో పదకొండున్నరో అయేసరికి బట్ట లన్నీ ఆరేసి వెళ్ళిపోతాడు. ఇప్పట్లాగే ఇంట్లో సంధ్యా, ఉషా మిగుల్తారు. ఉష కూడా ఈ రోజు ఇందాకనే పాలుతాగి నిద్రపోయింది. ఈ ప్రశాంతమైన వాతా వరణంలో కాలండర్‌లోని మనోజ్ఞమైన దృశ్యాల్లో లీనమై యేదేదో ఆలోచిస్తోంది

సంధ్యః

కాంపౌండులో చెట్ల ఆకులు ఒరుసుకున్నప్పుడూ, పిచికలు చిత్రంగా తమాషాకి పోట్లాడుకుంటూ ఎగిరిపోయేప్పుడూ వచ్చేశబ్దం ఆ ప్రశాంతతకి భంగం కలిగించట్లేదు. అదొరకమైన పరిపూర్ణత్వం వస్తోంది. ఉండుండీ ఉడతలుచేసే శబ్దం మాత్రం ఎవరో పైకివస్తున్నట్లుండే అలికిడిచేసి హడావిడి పెడుతుంటాయి. మొదట్లో సంధ్య ఎవరో అనుకునేది. తరవాత పరిశీలనగాచూస్తే హుషారుగా పరిగెత్తే ఉడతలు కనిపించాయి. 'నిశ్శబ్దాన్ని భరించడం, నిశ్శబ్దంగా ఆనందించడం తెలీదు. అమాయకపు ప్రాణులు' అనుకుంది సంధ్య. దూరాన్నుంచి అప్పుడప్పుడు అస్పష్టంగా వినిపించే కారు హారన్లూ, రికార్డులూ, కొద్దిపాటి రణగొణధ్వనీ నాటి మాటికీ ఇంతటి ప్రశాంతతా— పెద్దనగరంలో అనే విషయాన్ని గుర్తుతెస్తాయి ఎండా, చలీ అనే భేదం లేదు. ప్రకృతీ ఇక్కడ హాయిగానే అనిపిస్తుంది. ఏదీ భయంకరంగా ఉండదు.

నిద్రలోనే ఉష కొద్దిగా కదిలినట్లనిపిస్తే ఉలిక్కిపడి అటు పరుగెత్తింది సంధ్య. కళ్ళు విప్పకుండానే పెదాల్తో చప్పరిస్తూ నిద్దట్లోనే నవ్వుతోంది ఆమె కనుపాప. లాలనగా ఓసారి జోకొట్టి, ప్రేమగా ఉయ్యాల నోసారి కుదిపి అలవాటుగా కిటికీ దగ్గర నుంచున్న సంధ్య బయటదృశ్యంచూచి క్షణం నిశ్చేష్టురాలై, మరోక్షణం నవ్వుకుంది.

ఎదురుగా అందాలొలికే చిన్న మేడ. వేడిలేని ఆ తెల్లటి కాంతిలో రంగులు అందంగా మెరుస్తున్నాయి. పైకి పాకిన సన్నజాజితీగలు స్వచ్ఛమైన కాంతిలో మెరుస్తూ అటూ ఇటూ అందంగా ఊగుతున్నాయి. నిజానికి ఆ కాలనీలో అన్నీ ఇలాంటి మేడలే ఇంచుమించు. తెలీనివాళ్ళకన్నీ ఒకేలాకూడా అనిపిస్తాయి.

ఆ యింటిగేటు యివతల గోడ ప్రక్కగా ఏడేళ్ళ శ్రీకాంత్ చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకుంటూ మధ్య మధ్య వెక్కుతూ ఏడుస్తున్నాడు. ఉండి వుండి కోపంగా కసిగా ఆ ఇంట్లోకిచూస్తూ వాడికే శక్తి వుంటే ఆ యింట్లో వాళ్ళనే కాదు, అమాంతం ఆ యింటినే మింగేసే కసివుంది ఇప్పట్లో శ్రీకాంత్‌కి.

చిన్నపిల్లల మనసెందుకిలా కష్టపెడతారో అన్నీ తెలిసి! కనీసం లాలనగా బుజ్జగించనైనా చేతరాదా?! పసి హృదయాన్ని ఇలాగే పగులగొట్టి, ఆ తర్వాత వాపోతారు, మావాడు మాక్కాకుండా పోయాడు, ఏన్నాళ్ళు పెంచితే యేం—అని. పెంచడంలో ఏముంది! కాస్త ఖరీదైన భోజనం, ఖరీదైన బట్టలూ పడేస్తేనే ఆపేక్షలు పెరుగుతాయా!

అప్పుడే మలుపుతిరిగిన జయశ్రీ—ఆ కాలనీలోనే నాలుగిళ్ళ అవతల వాళ్ళమ్మాయి—వాళ్ళ స్నేహితురాల్తో వస్తోంది. ఆ అమ్మాయికి బహుశః ఈ వైపు రావడం ఇదే కొత్తేమో! తన ఫ్రెండ్ చెప్పేదేం వింటున్నట్టు లేదు. 'ఎంతో చిత్రంగా ఆత్తగా రెండువైపులా చూస్తూ యాంత్రికంగా అడుగులేస్తోంది. వాలకంచూస్తే—ఏమంత బీదవాళ్ళకాదు. కాని అంతకంటె కలిగిన పరిస్థితుల్లో చిక్కిన మామూలు మధ్యతరగతికి చెందినట్లు అనిపిస్తోంది. ఆ యిళ్ళవైపెంతో ఆసక్తితోటీ కొంత ఈసుతోటీ రెండుకళ్ళూ పూర్తిగా విప్పిచూసే ఆ అమ్మాయి శ్రీకాంత్ ఏడుస్తూ వాళ్లింటివేపు ఉడుకుమోత్తనంగా చూడ్డం చూసి రక్కున ఒకక్షణం ఆగిపోయింది కాళ్లకు బలవంతాన బ్రేకు వేసినట్టు. ఆ అమ్మాయి స్తిమితం తప్పిన బెదురు కళ్ళనిండా ఆశ్చర్యం అలముకుంది త్రుటిలోనే. ఆమె మనసులో భావాలన్నీ అద్దంలోలా కనిపిస్తున్నాయామె మొహంలో—ఇంతదూరాన్నుంచీ సంధ్యకు. కళ్లలోఉన్న అందమైన, మంచులాంటి మృదువైన పొరేదో హఠాత్తుగా తొలగిపోయినట్లయి, ఆ అమ్మాయికళ్ళు శ్రీమంతుల బిడ్డలమీది జాలితో ఆర్ద్రమైయ్యాయి. శ్రీకాంత్ ముందునుంచి వాళ్ళు దాటిపోయారు. అయినా ఆ అమ్మాయి వెనుతిరిగి ఎంతో ఆత్మీయతగా, జాలిగా ఆ అబ్బాయి వైపు చూస్తూనే ముందు క్కదిలిపోయింది.

గొప్పవాళ్ల గొప్పతనమంతా వట్టిపటాటోపమనీ, ఆ డాంబికం దర్జాలవెనుక అహంకారం అజ్ఞానం తప్ప మరేంలేవనీ; నికృష్టమైన ఆదర్శం తాముచేసే తప్పటడుగులను ఒకరు వేలెత్తి చూపకుండా ఉండడానికి 'ఎర'గా ప్రయోగించే సాధనమేకాని, కన్నబిడ్డలు చేసిన చిన్న పొరపాట్లను సహితం క్షమించలేనంతటి హృదయ దౌర్బల్యం లేదా దారిద్ర్యంతో నిండివుందనీ; ఆత్మవంచన స్వార్థం ఇవి వాళ్ల ఊపిరిలో కలసి రక్తంలో ప్రతి అణువులోనూ లయమైపోయాయనీ ఆ అమ్మాయికి తెలిస్తే ... ఆ అమ్మాయి దురభిప్రాయాలన్నీ పోయి తన జీవితంలో సుఖపడచ్చు.

ఇదంతా శ్రీకాంత్‌కి అనుభవ పూర్వకంగా తెలుసు. కాని మాటలలో 'ఇదీ' అని చెప్పటండాని లేతవయస్సతనిది.

ఈ భావాన్ని మాటలలో పెట్టగలిగే శక్తి వచ్చేసరికి అతనూ ఈ ఆత్మవంచనా, స్వార్థాల విలువ తెలుసుకుని — అప్పటికి ఆపాదించబడే ఆ కొంత గౌరవాన్నీ నిలుపుకోడానికీ; జీవితంలో తల్లిదండ్రుల్నీ వాళ్ళ డబ్బునీ ఉపయోగించుకుని పైకి రాగలిగిన అవకాశాల్ని వదిలిపెట్టుకోలేని స్థితికీ, వచ్చేస్తాడు. మళ్లీ ఇంతే. చరిత్ర పునరావృత్తమవుతుందంటారు. సైనికులు పరిస్థితులకు తట్టుకునేట్లా రాటుదేలినట్లే వీళ్ళూ ఖరీదైన ఊపిరి పీల్చుకుందుకు అలవాటుపడి అందుకు అనుగుణంగా రాటుదేలుతారు. ప్చ్ ... నిట్టూరుస్తూ వెనుదిరిగింది సంధ్య.

ఆమె గమనించనే లేదు. ఆగి ఆగి వినిపించే ఆ పాట కూడా ఎప్పుడాగి పోయిందో ఆగిపోయింది.

ఇప్పటి ఈ నిశ్శబ్దంలో చిలిపితనం లేదు. పెద్ద ముత్తైదువకుండే గాంభీర్యం ఉంది.

పొద్దున్నే మంజుల చెప్పింది.

'చిన్నక్కా, ఈసారి దీపావళి కథల పోటీలో మొదటి బహుమతి కథెంత బావుందనుకున్నావు!'

'ఎప్పుడొచ్చిందే, అప్పుడే ఎప్పుడు చదివావు?' ఆశ్చర్యం ప్రకటించిందామె.

'ఇప్పుడేలే కాని—నేను ఒక్కటే చదివాను. మరి వస్తానూ టైమైపోతోందీ' అంటూ వెళ్ళిపోయింది

బస్సులన్నీ సరిగ్గా దొరికితే వంటిగంటకి వచ్చేస్తుందది పన్నెండున్నర నుంచీ మొదలెట్టి సాయంత్రం ఆరయ్యేసరికి అందరూ మళ్లీ గూటికి చేరతారు.

వెళ్లి పుస్తకం తీసుకుని ఉష ఉయ్యాల

అటు కొద్ది దూరంలో గోడ ప్రక్కగా ఉన్న మంచం మీద పడుకుని పుస్తకం తీసింది,

గాలి రయ్‌మని కిటికీ తెరల్ని దూసుకొచ్చి, రకరకాల పూల వాసనల్ని మోసుకొచ్చి ఆమెకు కానుకగా ఇచ్చి చిలిపిగా ఆమె ముంగురులను సవరించి దూరంగా వెళ్ళి వెనక్కు మళ్ళి కిలకిల నవ్విన రొద చేస్తోంది.

పత్రికలో 'అంకితం' అన్న మొదటి బహుమతి కథ వ్రాసింది 'ఎమ్. కె గాంధీ' అని చూడగానే మంజు మాటలు గుర్తొచ్చాయి సంధ్యకి. పేజీలు తిరగేసేలోపునే వేగంగా మనసు ఆలోచించేస్తోంది.

ఈ రచయిత తల్లితండ్రులు దేశభక్తులై వుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పోరాడి వుంటారు. గాంధీగారి మీద భక్తి గౌరవాల్తో తమకు అప్పట్లో పుట్టిన ఈ బిడ్డకి 'గాంధీ' పేరు పెట్టి ఉంటారు. అసలు పూర్తి పేరు ఏ 'మోదుగ కల్యాణ గాంధీ'యో అయి వుంటుంది.

పాపం, తెలుగువాళ్ళకు ఉత్తరాదివాళ్ళ గురించి అప్పట్లో ఏమీ తెలిసేది కాదు. ఇప్పుడయితే మాత్రం తెలుసుకునే అవకాశాలున్నాయి కాని చాలామందికి తెలీదు. సరికదా తెలుసుకో

# సంధ్య

కుండానే వాళ్ళ ఇంటిపేర్లు తీసుకొచ్చి వీళ్ళకు పేర్లుగా పెట్టెయ్యడం! కాస్త నిదానంగా దేనిగురించి ఆలోచించడానికీ విచారించడానికీ టైము మిగలటంలేదు.

యంత్రయుగంలో మనుషుల బ్రతుకులే యాంత్రికంగా జరిగిపోతున్నాయి.

కథ మొదలుపెడుతూనే కళ్ళుచురుగ్గా కదిలిస్తూ పేజీలు జరిపేస్తోంది సంధ్య. పడుకున్నది కొంచెం ఒత్తిగిలనైనా ఒత్తిగిలకుండా కాళ్ళూచేతుల్ని కొద్దిగానైనా కదపకుండా మొహంలో రంగులు మార్చుకుంటూ ఏకబిగిని ఇరవై నిముషాల్లో కథని ముగించి 'హుఁ' అని ఒక మూలుగు లాంటి నిట్టూర్పు విడిచి, పుస్తకం తలగడ మీద పడేసి లేచినుంచుని ఆవలిస్తూనే వెళ్ళి కాసిని మంచినీళ్ళుతాగి బాల్కనీలోకి కిటికీ తెరల్ని విసురుగా తప్పించి చూసే సంధ్య కళ్ళు కోపంతో ఎర్రబడి — ఏ అపరిచితవ్యక్తి మీదో పీకలవరకూ కసితో అసహనంగా బయటికిచూస్తూ పచార్లు చేస్తోంటే, సర్కసు బోనులో చిరుతపులిలా కదుల్తోందనిపిస్తుంది

కథ మామూలుదే... నిరంజన్ నిర్మలా ప్రేమించుకుంటారు. అలా ఇలా కాదు. ఎంతో గాఢంగా. ఒకక్షణం ఒకళ్ళనుంచి కళ్ళు కనుమరుగైనా భరించలేనంత తీవ్రంగా.

ప్రేమించినవాళ్ళకు కావలసినట్టు ప్రవర్తించడంలోనే ప్రేమ వ్యక్తీకరించబడుతుంది.

ప్రేమించేవాళ్ళు ఎంత అమూల్యమైనదైనా అర్పించి తమ ప్రేమను తెలియబరుచుకో జూస్తారు.

అలాగే ఆమెకున్న సర్వస్వాన్నీ ఆమె ఆనందంగా అతని కర్పిస్తుంది. అతనూ అంతే.

కాని...తల్లితండ్రుల మాటల్ని కాదనలేకా, వాళ్ళ నెదిరించి డబ్బులేకుండా, ప్రేమతో అన్నీ ఇమడవని స్పష్టంగా అర్థంచేసుకుని చివరికి గత్యంతరం తోచక మళ్ళీ ఆ అమ్మాయి మొహం చూడడానికి ధైర్యం చాలక ఇంక ఆమెకు కనిపించకుండా తన జీవితంలో స్థిరపడిపోయాడు నిరంజన్.


అతనిరాక కెదురు చూసి చూసి, అతను రాక — అతని ఆకృతి తనలో కదలటం మొదలెట్టిన మొదట్లో భయంతో స్పృహ తప్పినప్పుడు, ఇంట్లో వాళ్ళకు కూడా తెలిసి చీదరించుకుంటే, వాళ్ళు చూపిన మార్గాన్ని అనుసరించలేక, ఏ దిక్కూ తోచక ఒంటరిగానే అతని ఆకృతితోనే తృప్తిపొందే అవకాశాన్ని వినియోగించుకుందుకు ఒంటరిగా, దృఢమైన నిశ్చయంతో గడపదాటింది నిర్మల,

క్లుప్తంగా కథ ఇంతే. కాని దీనిని మలచిన తీరూ ఆ శైలీకూడా ఎంతో హృద్యంగా ఉన్నాయి.

ప్రేమ దాని ప్రభావం—పర్యవసానం; స్త్రీపురుషుల దృక్పథాల్లోని వైవిధ్యం అంతా పాత్రల్లో పెట్టి అద్దంలోలా కనిపించేలా వ్రాశాడు రచయిత

కథ చిన్నదే అయినా ముఖ్యమైన బరువైన విషయాల్ని సున్నితంగా చిత్రించాడు. పాఠకుల్ని అర్థం చేసుకోమనీ మీ సామర్థ్యంమీద నాకు నమ్మకముందనీ చెప్తున్నట్టు ప్రతీదీ వ్యంగ్యంతోటీ హాస్యంతోటీ కలిపి చూపించాడు

కాని...ఆ రచయిత ఈ విషయంలో ఎంతవరకూ కృతకృత్యుడయ్యాడన్నది నిరాశాపూరితమైన జవాబొచ్చే పెద్ద ప్రశ్న.



విధిబలీయమని రచయిత చెప్పదల్చుకున్నట్టే చాలామంది అర్థం చేసుకుంటారు. ఇంకా మగవాళ్ళని నమ్మకూడదని కొందరూ, ఆడవాళ్ళు తప్పటడుగువేస్తే కూడదీసుకోలేరని కొందరూ అనుకోవచ్చు. నిజమే ఇవన్నీ చెప్పదల్చుకున్న మాట నిజమే కాని...ఇవేకాదు. ఆ కథ నడిపినతీరు మళ్ళీ జ్ఞాపకమొస్తోంది సంధ్యకు.

మొదటిసారి నిర్మలను చూసినపుడు నిరంజన్ డైరీలో ఇలా వ్రాసుకుంటాడు.

'నిర్మల నలుపే అని గుర్తించేముందే ఆమె కళ్ళు ఎంతో అందంగా నిర్మలంగా ప్రస్ఫుటంగా గుర్తిస్తారెవరైనా. ఆమె కొద్దిగా ఊగుతూ నడుస్తున్నట్లు గమనించే ముందే ఆమెజడ పొడుగైందని గమనించినట్టు' అని.

అంటే 'ప్రేమ' సాధారణంగా బాహ్యాకర్షణతోటే ఆరంభిస్తున్నట్లు రచయిత చెప్తున్నాడు.

ఈ వైవిధ్యం చూపడానికే రచయిత నిరంజన్‌ని మొదటిసారి నిర్మల ఎలా గమనించిందో వ్రాస్తూ.

'ఇంత మంటల్లోపడి లోపలికెళ్ళి వాళ్ళకు సాయపడేదాకా అతనికేం పట్టింది! ఎంతమంది బయటనుంచుని తమాషా చూడ్డంలేదూ! తోటి మనుష్యులమీద ఈమాత్రం జాలిలేని పిశాచాలా మనుష్యులేనా! అతనిదెంత జాలిగుండె!' అనుకుంటుందిట.

అంటే మొదట్నించీకూడా అతని హృదయానికే ఆకర్షితురాలైనట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ఏదో పనిమీద నిర్మల వాళ్ళవాళ్ళ ఊరు నాలుగురోజులకోసం వెడితే ఆ నాలుగు రోజులూ నాలుగు యుగాలుగా నడుస్తాయి ఇద్దరికీ.

కాని ఇక్కడకూడా వాళ్ళ తహతహల్లోని తేడా ఎంత స్పష్టంగా వ్రాశాడు! ఆమెది అతని సాన్నిధ్యంలో ఉండాలనే తపనైతే; అతనిది ఆమెను సన్నిహితంగా చేసుకోవాలనే కాంక్షట.

కాని నిస్సందేహంగా ఆ క్షణంలో అతను మనస్ఫూర్తిగానే ఆమెకోసం బాధపడ్డాడు విరహవేదననుభవించాడు ఆమెలా. కాని ఎప్పటికీ అదేభావం నిలుపుకోలేక మనసుని కఠినంగా శాసించుకుంటాడట ఇంక ఆమెను మరిచిపోవాలని.

అక్కడే కోపంవస్తుంది సంధ్యకు. అంత మరిచిపోగలిగితే మొదటే మరిచిపోవచ్చుగా. అతని పరిస్థితులూ వాళ్ళ వాళ్ళ భావాలూ అన్నీ అతనికి మొదటి నుండీ తెలుసుకూడాగదా! ఆమెను మధ్య పెట్టడంలో అతని ఉద్దేశ్యం?




FDS AG 1660 TEL

అది కేవలం కామంకాదూ! అతనూ మరైతే ఆమె లేనప్పుడు తపించడం అబద్ధం కాదే! అంటే అది కేవలం అల వాటైన అందుబాటులో ఉన్న వస్తువు కావాలనుకున్నప్పుడుండే తహతహే.

ఆకలేసినపుడు అన్నం కావాలనుకున్నంత మామూలుగా కావాలనుకుండచ్చు. ఆలస్య మయేకొద్దీ ఆకలిమంటలలో ప్రపంచం ఏదీ కనపడకుండా ఒక్క అన్నమే పరబ్రహ్మ స్వరూపంగా కళ్ళముందు కద లాడుతుంది. అలాగే ఇదీని...

ఎంత మెత్తగా మోసపోయింది నిర్మల! ఆరోజు 'అంత సిగ్గేమిటి, నిమ్మీ! నాదగ్గర! నీకోసం నేనేదైనా చేయటానికి సిద్ధమే. ధైర్యంగా ఇటు చూడు!' అంటూ తన వైపు తిప్పుకున్నప్పుడు 'నిరంజన్ పెన్ ఇచ్చినప్పుడెంత సంతోషంతో తీసుకుందో అంతే సంతోషంతో అతనికి అంకితమై పోయిందట.

ఇంకోసారనుకుంది సంధ్య అవును ఈ ఎన్. కె. గాంధి చాలా బాగా వ్రాశాడీ కధని—అని.

మగవాళ్ళలో ధైర్యముంటుందనుకునే వాళ్ళకిది కనువిప్పు.

నిర్మల సిగ్గుపడింది. ఆడవాళ్ళందంగా సిగ్గుపడతారు; కాని ధైర్యంగా అవసర సమయాల్లో పరిస్థితులెదుర్కొంటారు. అందుకే తన వారిని విడిచి తెలీనివాళ్ళ మధ్యలో తన ప్రేమనే ఆరాధిస్తూ జీవి తాన్నే అంకితం చేసింది.

నిరంజన్ మొండివాడు. మగవాళ్ళు సహజంగా పిరికివాళ్ళు. అప్పుడప్పుడు మొండికెత్తుతూంటారు. అతను నిజంగా నిర్మలనే ప్రేమిస్తే తన దాహానికామెను బలిపెట్టక్కర్లేదు. ఇటువంటి వారి దాహా నికి బలికావడానికి, పాపం, కొందరు జీవి తాల్నే బలిపెట్టుకు ఎదురు సంఘం చేత వెలివేయబడుతున్నారు. అలా కాదని ప్రేమ పేరుతో—పోని ప్రేమించినా—వారి జీవితాల్నే కర్కశంగా నలిపివేయడం — ఆ క్షణికమైన ఆవేశంలో నిరంజన్ అను కుంటాడు: 'ఎవరేమన్నా లెక్కచెయ్యను. నువ్వెప్పటికీ నా దానివే. నీకోసం నేను నా సర్వస్వం త్యాగం చేస్తాను' అని. తన కేదో ఎక్కడో ఉన్నదానిమీదే పంచ ప్రాణాలూ పెట్టుకుని — దాన్నే 'సర్వ స్వం'గా అంతరాంతరాల్లో అనుకుంటూ వదులుకుంటున్నందుకు బాధపడు తున్నట్టు 'త్యాగం' అనడంలోనే అతని బలహీనత—హీనత అర్థమవుతోంది. అతని కుండాల్సింది 'నాకున్నది నీకోసం త్యాగం చేస్తున్నాననే భావం కాదు — నా సర్వసం అయిన నిన్ను దేనికోసం త్యాగం చెయ్య లేను' అని. మరి ఇది మొండితనం, మూర్ఖత్వం కాదా! ఏమంటే వాళ్ళనాన్న 'ఇలా జరగడానికి వీల్లేదు. నీకా అమ్మాయే కావలసొస్తే నువ్వు మాకు పుట్టలేదనుకుంటాం. ఆలోచించుకో' అన్నప్పుడు 'జీవితంలో ప్రేమకు ఎన్నో సహకరించినప్పుడే అది నిలుస్తుందని'

## ఓం నమః శివాయ

కం. ఛకళక లాడు చుంటి నన్న
ఛాంతాతీత ఛాకార విచార
విజ్ఞానిన్
ఛింగ కళింగ కోటి లింగ
ఛితిసీతము లల్లుకొను లీల
నిన్నొదలన్.

కం. ఛచ్చు బుచ్చు లుచ్చను గామ
ఛారుపేరు వద్దన్న నీపేరు
చాలన్న
ఛక్ష వృక్ష రక్షణుడ వన్న
ఛవాక్షా శిక్షణ విచక్షణ వీక్షణ
నీవున్.

కం. ఛెమ్మ మేల్కొంచు మంటిన్
ఛేలేరు దిక్కు దిగంబరా దీన
నంటిన్
ఛైస్త్రైయని యనుగ్రహించన్న
ఛాక్కారి అభిమాన ఆదరణ
నభిలషించ.

కం. ఛాలోకులు స్వార్థులన్న
ఛా సౌరక్షణ నిరీక్షించుచు
అనుంగు బిడ్డనే
ఛంద కళంద కళావతిని
ఛః హద్దుదాటి హరునిహసింప
చేతు సేవింతు.

రచయిత్రి : శ్రీమతి సరస్వతీగిరి,

గ్రహించడం—అంటే సంఘంలో వెలుగురికి భిన్నంగా, ప్రత్యేకంగా కనపడ్డానికి భయం పిరికితనం అన్నమాట. మరి ఆనాటి ధైర్య ప్రదర్శన ప్రాణాలకు తెగించిన మొండి తనం. అంతకు ముందు అనే ప్రేమా గీమా అన్నీ వదిలిపోయి అప్పుడే వేరొకతి జీవితంలో ప్రవేశించి — అన్నీ మర్చిపోయి నట్టు నటించడం కూడానూ!

ఆడవాళ్ళెప్పుడూ మగవాళ్ళని ప్రేమించ కూడదు. ప్రేమించినా వాళ్ళ మాటలు నమ్మి పూర్తిగా వాళ్ళకు కైంకర్యమై పోకూడదు. ఇంత చిన్న విషయం అర్థం కాదే ఎవ్వరికీ!

ఆలోచనలతో మథనపడుతూ అటూ ఇటూ తిరుగుతున్న సంధ్య ఉయ్యాల్లో ఉష ఆరున్నొక్క రాగం అలాపించడంతో సర్వం మరచిపోయి అటు పరుగెత్తింది.

మొహం అంతా కాటుక చేసేసుకుని, మూసిన గుప్పిళ్ళతో ఇంకా కళ్ళు రుద్దు కుంటూ కాళ్ళు సాముచేస్తున్నట్టాడిస్తూ ఏడుస్తోంది ఉష.

పాపని సున్నితంగా పైకితీసి ఎత్తు కుని చిన్నగా కుదుపుతూ ఆమెకే అర్థం కాని భాషలో ఆడిస్తూ మొహం తుడిచి పౌడరు రాస్తోంటే గేటుతీసిన చప్పుడైంది. కిటికీదగ్గరకొచ్చి కాళ్ళెత్తి క్రిందకు చూసిన సంధ్యకు వేణు కనపడ్డాడు.

ఉషని పక్కమీద పడుకోబెట్టి తలగడ ఒకటి అడ్డుపెట్టి క్రిందికి వస్తోంటే కాలింగ్‌బెల్ మ్రోగింది. తలుపు తీసిన సంధ్య వేణు మొహం దేనికో హుషారుగా ఉన్నట్టు చెప్తోంటే నవ్వుతూ 'ఏమిటి?' అని కళ్ళతోటే అడిగింది

'అదికాదు చిన్నక్కా! ఏమైందను కున్నావు! వచ్చేస్తోంటే బస్‌స్టాప్‌లో నుంచున్నామా, చాలా మందే వున్నారు. అందులో ఇద్దరమ్మాయిలు చేతిలో పుస్త కాల్తో నిలబడి చూస్తున్నారు మామూ లుగా ఏమంత బాగా వుండివుండరులే. మధ్యాహ్నమేమో, మేకప్ అంతాపోయి, జిడ్డుకారుతూ కాస్త అసహ్యంగా కూడా వున్నారు. బస్ వచ్చేస్తోంది. అందరూ

మాటలాపేసి అటు చూస్తున్నారాత్రంగా. మాముందునుంచే బస్ చాలాదూరం దూసుకుపోయింది. అందరూ అటు పరుగెడుతున్నారు. ' అమ్మాయిలుకూడా అటు పరుగెడుతున్నారనుకో. మా వాడేమో అటు బస్‌కేసి చూస్తూ 'ముఝే రండ్ లగ్ రహీహై ముఝుసే దూర్ తూ నజా' అన్నాడు. అంతే ఇంకేముంది! ఒకమ్మాయి మమ్మల్ని మింగేసేట్టు కోపంగా మాకేసి చూసింది' నవ్వుతున్న కళ్ళతో మధ్య మధ్య అభినయంతో వేణు ఏదైనా తమాషాగా చెప్తాడు.

'ఏం ఫ్రెండ్స్‌రా బాబూ! ఉత్తినే కోపంగా చూసి ఊరుకందా? పాపం!'

'అదికాదు, చిన్నక్కా, వాడు మొదట నిజంగానే బస్ అలా దాటిపోతోంటే పాడాడు. కాని వాళ్ళు అలా అది వాళ్ళ మీదే పెట్టుకుని వాళ్ళ ఉలకు చూపిస్తే వాడిక్కాస్త హుషారు వచ్చి 'నజా' అని సాగదీస్తూ ఈసారి చెయ్యిజాచి మరీ పోజు పెట్టాడు. వాళ్ళు కోపంగా నేలని తన్నుకుంటూ...' ఇంకా ఉబికే నవ్వుని ఆపుకోలేక నవ్వుతూనే ఉన్నాడు వేణు.

'మాకు తగుల్తుందనుకున్నారేమో! ఫూల్‌గర్ల్స్! విసురుగావెళ్ళి మేమెక్కిన బస్‌లోనే ముందు ఎక్కారు. అంతే తేడా. ఏమీలేదు' పుస్తకాలు అల్మైరాలో పడేసి వెళ్ళి కాళ్ళు కడుక్కుని తిన్నగా ఉషదగ్గర కెళ్ళి ఎత్తుకు ముద్దులాడడం మొదలెట్టాడు. రోజూ అందరూ అంతే. రాగానే ఒకసారి దాన్నెత్తుకోందే అన్నం తినరు.

'అన్నం పెట్టనా వేణూ?'

'వద్దు. ఇది పెడితే తింటా' అన్నాడు 'ఏమ్మా! పెడతావా!' అంటూ తలెగరేస్తూ దాని మొహం మీదికి వంగి తలూపుతూ.

అన్నింటికీ ఒకటే జవాబులా నవ్వుతూనే ఉంటుంది ఉష. ఎలా కావాలంటే అలా సర్దుకోవచ్చు నవ్వుని.

'పోనీ కాస్త టిఫిన్‌తెస్తాను' అంటూ వద్దనడని తెలుసు గనుక లోపలికెళ్ళింది సంధ్య ఆలోచనల బరువులో మందంగా నడుస్తూ. వేణూ మనస్తత్వమే అంతే. ప్రతిదీ 'జోక్' అంటాడు. ఎంజాయ్ చెయ్యలేని వాళ్ళని చూసి ఇంకొంచెం నవ్వుతాడు.

ఆడపిల్లల కసలేమీ సెన్సాఫ్ హ్యూమర్ ఉండదని చెప్తుంటాడు. ఆ మధ్య నోసారి సంధ్య ఈ మాటకు కొంచెం చిన్నబుచ్చుకున్నట్టు కనపడడంతో మరీ ఎవరే జోక్‌ని ఎలా ఎంజాయ్ చెయ్యలేక పోయారో చెప్తుంటాడు.

సంధ్య సిద్ధాంతాలన్నీ ఇక్కడి కొచ్చే సరికి వల్చబడిపోతూంటాయి. బహుశా ఎప్పుడూ ఇలా చప్పబడిపోవడం అందరికీ అలవాటే. సంధ్యకేకాదు అందరికీ కూడా వాళ్ళ అన్నదమ్ముల ప్రవర్తన చాలా సరైనదిగానూ, ఎంతసేపూ వాళ్ళ మంచితనం, గొప్పతనమే బాగాను కనిపిస్తాయి. మరి ఇవి ఎదుటివ్యక్తులలో ఎందుకు చూడలేరో!

ఇదే ఎవరో అయితే విమర్శించేదే సంధ్య. కాని చిన్నన్నయ్య వేణుని దగ్గర




కొచ్చేసరికి దృక్పథం మారుతుంది;

'నిజమే...వీళ్ళేదేనా అంటే— అనగలిగితే వాళ్ళా ఆ గాలి లేకుంటే తనుని కాన ట్టుండిపోవాలిగాని ఈ హావభావ ప్రకటన లెందుకు సినీమాల్లోలాగా. ఏమైనా వాళ్ళ చూపులకి వీళ్ళు కొంగల్లా రాలిపోతారా?' సంధ్య సమర్థింపులు నిజజీవితంలో ఇలా వుంటాయి.

నిన్నటికి నిన్న చిన్నన్నయ్య బయట ఎవరితోనో గట్టిగా అరుస్తున్నాడు. ఏమిటా అని తనూ చూసింది. బయట మెట్ల దగ్గర ఎవరో ఒకామె ఒకచేతిలో కాగితం; రెండో చేతిలో సంచితో.

'హమ్ పరదేశీ హై; థోడా మదద్ కరో' అని ప్రాధేయపడుతోంది చిన్నన్నయ్య అచ్చతెనుగుతో—

'ఇచ్చింది పుచ్చుకు వెళ్ళిపోతావా— అదికూడా ఊడలాక్కో మంటావా ?' అంటున్నాడు. రమేష్, జయ, వేణు కూడా అక్కడేవున్నారు. అందరూ గొల్లున నవ్వారు. పైనుంచి వదినకూడా చూస్తూ వుట్టుంది. నవ్వు వినిపించింది. 'అలా అనకు బాబూ! మూడంతస్తుల మేడోరు. అర్ధరూపాయినా ఇచ్చేది ?' అంది మామూలుగా మొదలెట్టి చివరికి తెలం గాణయాస తెప్పించుకుంటూ. అడుక్కునే వాళ్ళ కన్నిభాషలూ వస్తాయిలా వుంది!

'అంతస్తులు మూడుంటేయేం? మొదటి అంతస్తులోంచేగా ఇచ్చేది—ఇలానే ఇస్తారు. ఎప్పుడేనా పైనున్నప్పుడు కనపడు చూద్దాం.' మళ్ళీ అందరూ గొల్లున నవ్వుతున్నారు. వేణూ మరి తప్పట్లు తరుస్తూ ఊగు తున్నాడు.

నిజానికి దానికో అయిదు పారేసినా వీళ్ళకి తరిగిపోయేదేంలేదు గాని సంధ్య మళ్ళీ ఇదీ సమర్థించుకుంది.

'ఏంతుంటేయేం? ఇంతమంది వచ్చే పోయేవాళ్ళు; ఇంతమంది చదువులు! అసలు చిన్నన్నయ్య చచ్చినవాళ్ళ ఎముకల కోసమే చచ్చినంత తగలేస్తాడు. అక్కయ్య అస్తమానూ వస్తూనే వుంటుంది రమేష్‌ని చూడాలనుందనే వంకతో దానితో ఒక మంద వచ్చి పడతారు. పెద్ద న్నయ్య ఉద్యోగం చేస్తున్నా డన్నమాటే గాని అంతకు రెట్టింపు వాళ్ళ ఫ్రెండ్స్‌కిచ్చే పార్టీలకే ఖర్చవుతుంది. అందరూ కాలేజీలకూ, స్కూళ్ళకూ పోయేపిల్లలూ— ఏం లేకపోయినా కుదరదు. పైగా హోదాకు తగ్గట్టు లేకపోతే చిన్నతనం కూడాను. ఇలాంటి పెద్ద ఊళ్ళో ఉంటే అస్తమానూ చుట్టాలూ. బంధువులు, స్నేహితులూ రావడం వాళ్ళకే అవుతుంది చాలాభాగం. ఒకకారుందన్న మాటేగాని అది వాళ్ళకు ఊరు చూపించడానికే ఉండిపోతుం దెప్పుడూ. ఒక్కొక్కప్పుడు పాపం, నాన్న గారు కూడా టాక్సీలో వెళ్ళాల్సొస్తోంది. పిల్లలు సరేసరి. ఇంకోకారు కొనాలంటేనే పడటంలేదు—వీళ్ళందరికీ వండి పెట్ట డానికేం మిగుల్తుంది ?!' ఇంత అను కుని మరీ చిన్నన్నయ్యను సమర్థించు కుంది సంధ్య.

'రారా వేణూ. నీగదిలో పెట్టాను' కేకేసింది సంధ్య.

'ఇక్కడిచ్చేయ్, చిన్నక్కా.'

పట్టుకొచ్చి వేణుకి ప్లేట్ అంది స్తూంటేనే కాలింగ్ బెల్ వినిపించింది. తలుపు తీసింది సంధ్య ఒక్కపరుగునవచ్చి. అమ్మా, వదినా వచ్చారు.

'ఎవరేనా వచ్చారే సంధ్యా ?' అను కుంటూ జవాబు వినకుండానే నవ్వుతూ ఏదో పెద్దత్త వాళ్ళమాటలు చెప్పు కుంటూ లోపలికెళ్ళారు వాళ్ళు.

అప్రయత్నంగా అటు కళ్ళుతిప్పిన సంధ్య నూతి ప్రక్కగా వున్న సీతాఫలం చెట్టు మొదట్లో పుస్తకాలు పడేసి దేనికోసమో ఒకళ్ళ చేతిలోంచొకళ్ళు లాక్కుంటూ రమేష్ జయలు కనుపిం చారు.

'ఏమిట్రా అది' అంటూ వెళ్ళబోయిన సంధ్యని చూసి.

'ఏం లేదు పిన్నీ' అంటూ రమేష్ 'ఏం లేదత్తా' అంటూ జయ ఏకకంఠంతో పలికి బొగడుచెట్టు వెనక నుంచి దొడ్డు వైపుకి పారిపోయారు.

'చిన్నపిల్లలంతే కొట్లాడుకుంటారు' మరోక్షణంలో ఆడుకుంటారు. మధ్యలో ఎవరేనా కలగజేసుకుంటే పాపం చాలా ఇబ్బందిపడతారు. వాళ్ళ మానాన వాళ్ళను వదిలెయ్యాలి' అనుకుంది సంధ్య.

'సంధ్యక్కా ఉషేడుస్తోంది — అమ్మ రమ్మంటోంది' అని చిన్న చెల్లెలు పద్మ వచ్చి పిలిచేదాకా అక్కడే నుంచుంది సంధ్య.

'అప్పుడే వచ్చావేమే పద్మా ఈరోజు?' లోపలికొస్తూ అంది.

'ఆఁ...ఇవాళ స్కూలు మునిగిపోయింది రేపు కొంచెం నీరుతీస్తే రమ్మని చెప్పి తోలేశారు' అంది నవ్వుతూ జుట్టు తోసహా కత్తిరించుకుని అతినాగరికంగా ఉండడానికి ప్రయత్నించే పద్మ

సంధ్యకి ఇదే మరొకళ్ళైతే ఈ భాష న్నకు హద్దంటూ ఉండాలి అనుకునేదే కాని ... చెల్లెల్ని చూస్తే గుర్తొస్తాడులా వుంది.

లోపలికెళ్ళి ఉషను ఒడిలోకి తీసుకుంటూ.

'మా పాప నవ్వితే వెన్నెలే కురియాలి,
మా పాప పాడితే పాములే ఆడాలి'

అని సన్నగా కూనిరాగం తీసుకుంటూ సమస్తం విస్మరించి అలా ఎంతో సేపు లాలనగా ఆ చిన్నారి చేతిని నిమురుతూనే వుండి పోయింది.

ఇంట్లో రకరకాల శబ్దాలు. వంటిం ట్లోంచి గిన్నెల చప్పుళ్ళు; బీరువాలు తెరి చేసే చప్పుళ్ళు, వదిన గదిలోంచి తను తెచ్చుకున్న ట్రాన్సిస్టర్‌లోంచి వివిధ భారతి రికార్డులు సన్నగా వినిపిస్తున్నాయి. వేణూ క్రికెట్ కామెంటరీ జోరుగా పెట్టేసి రేడియో చుట్టూ ఎవరెవరంటి స్టెప్స్ వేస్తుండి వుంటారో ప్రాక్టీస్తుండి వుంటాడు—అడుగుల చప్పుడు; కింద పిల్ల కేరింతాలూ పకుల కిలకిలలూ, పిల గాలికి ఆకుల రొదా, మధ్య మధ్యలో దూరంగా గొర్రెల మందనదలించే మోటు కంఠాలూ —మెట్ల—పైన ఎప్పటి ఉడతల గోడా విడి — కాని సంధ్యకు పాపాయి పెదాల చప్పుడే హాయిగా, తీయగా సర్వస్వంగ విని పించి అనిపిస్తోంది...... ●